క్లుప్తంగా

అధ్యక్ష పదవి నుంచి తొలగింపు

ఆదిలాబాద్‌టౌన్: పీఆర్టీయూ మావల మండల అధ్యక్ష పదవి నుంచి గుమ్మడి రవీందర్ రెడ్డిని తొలగించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో సంఘం ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరించినందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

అవినీతిపై ప్రశ్నించినందుకే..
పీఆర్టీయూ సంఘ బాధ్యుడు చేసిన అవినీతిపై ప్రశ్నించినందుకే తనకు నోటీసులు జారీ చేశారని గుమ్మడి రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యత్వానికి, అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సంఘం భవనానికి నెలకు రూ.42వేల అద్దె వస్తుందని, అవి పారదర్శకంగా జరగడం లేదని ఆరోపించారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలో రూ. 19 కోట్లతో నిర్మిస్తున్న డబుల్‌రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంబిఎం మండల అధ్యక్షుడు జావిద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023 డిసెంబర్‌లో చేపట్టిన రోడ్డు పనులు ఇంత వరకు పూర్తి కాలేదన్నారు. వర్షకాలంలో పనుల్లో నాణ్యత లోపించే ప్రమాదం ఉంటుందన్నారు.

సిమెంట్ బస్తాలు అందజేత

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో నిర్మిస్తున్న ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా నిర్మాణ పనులు పరిశీలించి 20 సిమెంటు బస్తాలు విరాళంగా అందజేశారు. దాతలు ముందుకు వస్తే మరిన్ని పనులు చేపట్టవచ్చని అన్నారు. అంకతి రవీందర్, ఎం.బాలాజీ, గిత్తే తరుణ్, గిత్తే భరత్ ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

తాంసి: గర్భిణులు, బాలింతలు తప్పకుండా పోష్టికాహారం తీసుకోవాలని భీంపూర్ ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్ సూచించారు. మంగళవారం మండలంలోని అర్లి(టి), కరంజి(టి) ఆరోగ్య కేంద్రం పరిధిలోకి ఆయా గ్రామాల్లో గర్భిణులు, కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటా తిరుగుతూ వివరాలు సేకరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారి వెంట సంధ్యారాణి, సాహితి, మాయవతి, ఏఎన్‌ఎం సుజాత, సరస్వతి, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

తర్నంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో మండలంలోని తర్నం గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని మండల కన్వీనర్ శివారెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధిదీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

'రైతులపై లాఠీచార్జి అప్రజాస్వామికం'

ఎదులాపురం: రైతులపై లాఠీచార్జి అప్రజాస్వామికమని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ భవన్ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. విత్తన కొనుగోలు కేంద్రం వద్ద జరిగిన ఉద్రిక్తతలో రైతులపై పోలీసులు లాఠీచార్జి చేయడం సిగ్గుచేటన్నారు. జిల్లా అధికారుల తప్పిదంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, సాయికుమార్, రేణుక పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన బోధన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లెక్చరర్లు

- ఇంటర్ ప్రవేశాలపై అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం

నేరడిగొండ: ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అన్ని వసతులు కల్పిస్తూ.. నాణ్యతతో కూడిన విద్యను అందుబాటులో ఉంచే దిశగా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోంది. ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది ప్రవేశాలకు తొలివిడత ప్రక్రియ మొదలు కావడంతో పూర్తిస్థాయి సీట్లు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే లెక్చరర్లు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

13 కళాశాలలు..
జిల్లా వ్యాప్తంగా 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్‌లోని బాలుర, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు బేల, ఉట్నూర్, నార్నూర్, తలమడుగు, తాంసి, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. కార్పొరేట్‌కు దీటుగా వీటిలో సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రవేశం పొందే వారు డబ్బులు కట్టాల్సిన అవసరం ఉండదు. అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు తెలుగు, ఆంగ్లంతో పాటు కొన్ని కళాశాలల్లో వొకేషన్ కోర్సులున్నాయి.

ప్రత్యేక కార్యాచరణ..
ఈవిద్యా సంవత్సరం ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రత్యక్షంగా కలిసి విద్యా బోధన తీరు, అందుతున్న వసతులు, తదితర వాటి గురించి వివరిస్తున్నారు. తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేశారు. విద్యా సంవత్సరం ముగింపు ముందే లెక్చరర్లు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల వివరాలు సేకరించి లక్ష్యం నిర్దేశించుకున్నారు.

అన్ని రకాల వసతులు..
జిల్లాలోని కళాశాలల్లో విద్యార్థులు కూర్చునేందుకు ప్రత్యేక డెస్క్ బెంచీలు, మంచినీటి సదుపాయం ఉంది. అన్ని కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రయోగాల నిర్వహణకు అవసరమైన ఆధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతిఒక్కరికీ ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. విశాలమైన భవనాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



జూనియర్ కళాశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కళాశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించింది. తల్లిదండ్రులు వారి పిల్లలను పంపేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రవేశాలు పెంచేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడుతున్నాం. ఇప్పటికే ప్రవేశాలు మొదలవడంతో అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ప్రవేశాలు కల్పిస్తాం.
– రవీందర్, డీఐఈవో, ఆదిలాబాద్

నాణ్యమైన విత్తనాలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నేరడిగొండ: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని తహసీల్దార్ సంతోష్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి బిర్రు భాస్కర్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగి రశీదు ఇవ్వాలన్నారు. కావాలని కొరత సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తే విత్తన డీలర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వారి వెంట ఆర్‌ఐ నాగోరావు, పోలీసులు ఉన్నారు.

విత్తనాల కొరత లేకుండా చూడాలి
ఇచ్చోడ: మండలంలో పత్తి విత్తనాల కొరత లేకుండా చూడాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బత్తుల అశోక్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్తి విత్తనాల కొరత పేరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. కొన్ని రకం విత్తనాలకు డిమాండ్ ఉన్న మాట వాస్తవమేనన్నారు. కానీ రైతులు డిమాండ్ ఉన్న రకం పత్తి విత్తనాలనే అడుగుతుండడంతో కొరత ఏర్పాడుతుందన్నారు. జిల్లాలో ఎక్కడ విత్తనాల కొరత లేదన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించడం అభినందనీయం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో సభ్యులు

గుడిహత్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభను గుర్తించడం అభినందనీయమని డీఈవో ప్రణీత అన్నారు. పదో తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన సర్కారు పాఠశాలల విద్యార్థులను ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. మాన్కాపూర్‌లో ఏర్పాటు కార్యక్రమంలో వారికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. 36 మంది టాపర్లకు పురస్కారాలు అందజేసినట్లు ఫౌండేషన్ వైస్ చైర్మన్ మీర్‌కుమార్ పరియా ల్ తెలిపారు. ఇందులో ఫౌండేషన్ సీఈవో మధుకర్, డాక్టర్ కైలాస్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్, నారి వినోద్, ఫౌండేషన్ ప్రతినిధులు దిగాంబర్, ప్రశాంత్, ఆకాశ్, ద్రోణాచారి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దేగామ గ్రామస్తులు

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్ వద్ద నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులో ముంపు గ్రామైన దేగామలో వర్షాకాలంలో వరద నీరు ఇంట్లోకి వస్తుందని, పునరావాసం కల్పించాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. 2004 నుంచి ఇబ్బందికి గురవుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలను కూడా బహిష్కరించారు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క ఫోన్‌లో గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో ఓటేశారు. ఇదే విషయమై మంత్రిని కలువడంతో సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో సామన్‌పెల్లి శేఖర్, ఉయికే సుదర్శన్, నవీన్, ఉత్తం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న పీఠాధిపతి యోగానంద సరస్వతి

తలమడుగు: ఆధ్యాత్మికతతోనే మనసిక ప్రశాతత లభిస్తుందని గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. మంగళవారం మండలంలోని దేవాపూర్ శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో హనుమాన్ దీక్షాపరులు సింధూర పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తిభావంతో ప్రజలు చెడు అలవాట్లకు దూరంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో దశరథ్ పటేల్, శ్రీనివాస్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ పల్లకి ఊరేగింపు



పల్లకిని ఊరేగిస్తున్న హనుమాన్ దీక్షాపరులు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో హనుమాన్ దీక్షాపరులు మంగళవారం హనుమాన్ పల్లకిని ఘనంగా ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉత్సవమూర్తిని ఉంచి ఊరేగించారు. డప్పుచప్పులతో పాటు డీజే చప్పుల మధ్య చేపట్టిన ఊరేగింపులో హనుమాన్ స్వాములు నృత్యం చేశారు. గ్రామం రామ నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు గంగయ్య, మహేందర్, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

లాభదాయకమైన సాగు పద్ధతులు అవలంబించాలి

గుడిహత్నూర్: రైతులు లాభదాయకమైన సాగు పద్ధతులు అవలంబించాలని ఏఈవోలు శ్రీధర్, వెంకటి, స్రవంతి అన్నారు. మండలంలోని తోయగూడ, దంపూర్, గర్కంపేట్ గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సాగులో ఫలితాలు సాధించాలంటే మొదటగా మేలైన రకం విత్తనాలను ఎన్నుకోవడం, దుక్కులు బాగా దున్ని సేంద్రీయ ఎరువులు చల్లుకోవడంతో పాటు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కొంత మంది నకిలీ విత్తనాలతో ఆశలు చూపెట్టి మోసగిస్తున్నారని అలాంటి వారి సమాచారం వెంటనే అందించాలన్నారు.

నర్సరీ మొక్కలపై శ్రద్ధ పెట్టాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్పీవో ఫణీందర్

తాంసి: హరితహారం మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పంచాయతీ సిబ్బందికి డీఎల్పీవో ఫణీందర్ సూచించారు. మంగళవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామ పంచాయతీ నర్సరీని పరిశీలించారు. అనంతరం వైకుంఠధామం, ప్రకృతివనం, సెగ్రియేషన్ షెడ్డును పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పరిశుభ్రతతో క్లోరినేషన్ పనులు సైతం చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి రవికాంత్‌కు సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం నేరడిగొండ మండలంలో పర్యటించారు. వాంకిడి గ్రామంలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం గ్రామస్తులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ లోవోల్టేజీ, తదితర సమస్యలతో ఇబ్బంది తలెత్తుతున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన త్వరలోనే నిర్మాణం అయ్యేలా చర్యలు చేపడతానన్నారు. అనంతరం రాజుర గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల పనులను పరిశీలించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి
తలమడుగు: ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో దెబ్బతిన్న ఇళ్లను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. వారికి తాత్కాలిక నివాసం కోసం తాడిపత్రిలు అందజేశారు. తక్షణమే విద్యుత్ అధికారులతో మాట్లాడి కరెంటు పునరుద్ధరించాలని తహసీల్దార్‌కు సూచించారు.

ముమ్మరంగా జొన్న కొనుగోళ్లు



జొన్న పంట కొనుగోలు చేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో జొన్న కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం 580 మంది రైతుల నుంచి 12 వేల, 150 క్వింటాళ్ల జొన్న పంట కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ తెలిపారు. ఈనెల 30 వరకు జొన్న కొనుగోలు కేంద్రం కొనసాగుతుందని, రైతులు జొన్న పంట అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

31వరకే జొన్న కొనుగోళ్లు
బోథ్: ఈనెల 31 వరకు మాత్రమే జొన్న కొనుగోళ్లు ఉంటాయని బోథ్ సహకార సంఘం సీఈవో స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు జొన్న పంటను బోథ్ మార్కెట్ యార్డుకు తీసుకురావాలని కోరారు. 31 తరువాత కొనుగోళ్లు ఉండవని పేర్కొన్నారు.

జొన్న కొనుగోళ్ల గడువు పెంచాలి

నార్నూర్: జొన్న కొనుగోళ్ల గడువును పొడిగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాదవ్ రెడ్డి నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. జొన్న కొనుగోలు కేంద్రం గడువు ఈనెల 31తో ముగిస్తుందని ప్రచారం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, వాతావరణం ప్రభావం వలన చాలామంది రైతులు జొన్న పంటను తీసే పనిలో ఉన్నారన్నారు. కలెక్టర్ స్పందించి వచ్చేనెల 15 వరకు జొన్న కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. రైతులు సకారం, యశ్వంత రావు, తదితరులు ఉన్నారు.

బహుమతులు వస్తాయి.. ఓటీపీ చెప్పండి

- ఓ శీతల పానీయాల కంపెనీ నిర్వాహకుల ప్రచారం
- తిప్పి పంపిన పోలీసులు

బోథ్: ఓటీపీ చెబితే బహుమతులు వస్తాయంటూ.. ఓ శీతల పానీయాల కంపెనీ నిర్వాహకులు బోథ్‌లో ప్రచారం చేయడం పట్టణంలో కలకలం రేపింది. మంగళవారం వారసంత కావడంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. ఓ శీతల పానీయాల కంపెనీ నిర్వాహకులు తమ వద్ద రిజిస్టర్ ఐతే, సంబంధిత ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుందని, ఓటీపీ చెబితే కంపెనీ నుంచి తక్కువ ధరలో శీతల పానీయాలు వస్తాయని, డ్రాలో గెలుపొందిన వారికి మరిన్ని ఆఫర్లు ఉంటాయని ప్రచారం చేశారు. అనుమానం వచ్చిన కొంతమంది పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాము శీతల పానీయాల నిర్వాహకులను పిలిపించి మాట్లాడారు. గ్రామంలో తిరుగుతూ ఓటీపీలు అడగవద్దని, సైబర్‌క్రైం జరిగే అవకాశం ఉందన్నారు.

యూనిఫాంలు సిద్ధం చేయాలి

- ఐకేపీ డీపీఎం నరేందర్



దర్జీలకు బట్టలు అందజేస్తున్న డీపీఎం నరేందర్

జైనథ్: పాఠశాలలు ప్రారంభం కావస్తున్న నేపథ్యంలో జూన్ 10లోగా యూనిఫాం కుట్టు పనులు పూర్తి చేయాలని ఐకేపీ డీపీఎం నరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి యూనిఫాంలకు సంబంధించిన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 64 పాఠశాలలకు 5286 మంది విద్యార్థులు ఉండగా.. వారి కోసం 11538 యూనిఫాంలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భగవాండ్లు, సీబీవో ఆడిటర్ శ్రీనివాస్, ఎంఆర్‌సీ సుభాష్, సీసీలు, మహిళ సమాఖ్య అధ్యక్షులు సుజాత, రూప, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాల కోసం బారులు



బేల మండల కేంద్రంలోని నిలేష్ ఆగ్రో కేంద్రంలో మంగళవారం పత్తి విత్తనాల కోసం రైతులు బారులు తీరారు. దీంతో ఆగ్రో కేంద్రం నిర్వాహకుడు అందుబాటులో ఉన్న 160 విత్తనాల ప్యాకెట్లను పట్టా పాస్‌బుక్‌కు ఒకటి చొప్పున పంపిణీ చేశాడు. – బేల

పైప్‌లైన్ లీకేజీ

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి పరిధిలోని హీరపూర్ గ్రామంలోని మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కావడంతో నీరు వృథా అవుతోంది. మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీతో నీటి కొరత ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు

తాంసి: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల శివారులో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. తీగలను సరిచేయడంతో పాటు నూతన స్తంభాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలు సరిచేయాలని కోరుతున్నారు.

